వ(మ)ంట నూనె

- దిగుమతి సుంకం పెంపుతో ప్రజలపై భారం
- లీటరు ప్యాకెట్‌పై రూ.20 నుంచి రూ.30 పెంపు
- ఆందోళనలో వినియోగదారులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

వంట నూనె సలసలా కాగుతున్నాయి. వంట నూనెలపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాన్ని పెంచడంతో ప్రజలపై భారం పడుతోంది. లీటరు వంట నూనె ప్యాకెట్‌పై రూ.20 నుంచి రూ.30 వరకూ పెరిగింది. వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది...

వంట నూనెలలు సల సల కాగుతున్నాయి. లీటరు ప్యాకెట్‌పై రూ.20 నుంచి రూ.30 వరకూ ఒక్కసారిగా ధరలు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం ఇటీవల దిగుమతి సుంకం పెంచింది. ఈ నేపథ్యంలో ధరలు అమాంతంగా పెరిగాయి. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు కొండదిగనంటున్నాయి. తాజాగా కూరగాయల ధరలు కూడా అదే బాటలో ఉన్నాయి. అయితే ఇప్పటికే నిల్వ ఉన్న సరుకును కూడా అధిక ధరలకు విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కొంత మంది వ్యాపారులు నోస్టాక్ బోర్డును పెట్టి కృత్రిమ కొరతను సృష్టిస్తున్నారు. తాజా ధరల పెరుగుదలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జిల్లా వినియోగదారులపై నెలకు రూ.5 కోట్ల అదనపు భారం పడుతోంది. సన్‌ఫ్లవర్ నూనె 15 లీటర్ల డబ్బా ఖరీదు గత వారం వరకు రూ.1,730 ఉండగా తాజాగా అది రూ.2వేలకు చేరింది. లీటరు ప్యాకెట్ ధర రూ.108 నుంచి రూ.125-రూ.130కి ఎగబాకింది. అంటే లీటరుపై రూ.17 నుంచి రూ.23 వరకు పెరిగింది. 15 లీటర్ల పామాయిల్ నూనె డబ్బా ధర వారం క్రితం వరకు రూ.1,530 ఉండగా, ఇప్పుడది రూ.1,730 దాటింది. గతంలో లీటరు పామాయిల్ ధర రూ.95 ఉండగా తాజాగా రూ.115కి చేరింది. లీటరుకు రూ.20 వరకు పెరిగింది. వంటనూనెలు లేకుండా ఆహార పదార్థాల తయారీని ఊహించలేము. ఇప్పుడా వంటనూనె ధరల పెరుగుదలతో సామాన్య, మధ్య తరగతుల వంటింటి బడ్జెట్ గాడితప్పే పరిస్థితి ఏర్పడింది. పూజలకు వినియోగించే వివిధ రకాల నూనెల ధరలు కూడా అమాంతంగా పెంచేశారు. మొన్నటి వరకు లీటరు ధర రూ.100 ఉండగా, అవి ఇప్పుడు రూ.125-130కి చేరాయి.

బ్లాక్ మార్కెట్‌కు తరలింపు

కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచనుందన్న సమాచారంతో మిల్లుల యజమానులు, వ్యాపారులు వంట నూనెలను బ్లాక్ మార్కెట్‌కు తరలించేశారు. రెండ్రోజుల క్రితం డబ్బులు చెల్లించుకుని డెలివరీ ఇవ్వాల్సిన ట్యాంకర్లకు సంబంధించి మొత్తాన్ని వ్యాపారులకు వ్యాపార సంస్థలు వెనక్కి ఇచ్చేశాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా డబ్బు చెల్లిస్తే సరఫరా చేస్తామని షరతు విధించాయి. దీంతో హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు పెరిగిన ధరల ప్రకారమే విక్రయాలు ప్రారంభించారు. పామాయిల్, సన్‌ఫ్లవర్ అయిల్ మలేషియా నుంచి మన దేశానికి ఎక్కువగా దిగుమతి అవుతుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 15 లక్షల కుటుంబాలు ఉన్నాయి. ఆయా కుటుంబాలు నెలకు సుమారు 30 నుంచి 40 లక్షల లీటర్ల వంట నూనెను వినియోగిస్తున్నట్లు అంచనా. ఒక్కసారిగా లీటరుపై కనిష్ఠంగా రూ.20 నుంచి రూ.30 వరకూ పెరగడం వల్ల నెలకు రూ.5 కోట్లు వరకు వినియోగదారులపై అదనపు భారం పడుతోంది. దసరా, దీపావళి వంటి ముఖ్య పండుగలు వరుసగా ఉన్న నేపథ్యంలో నూనె వాడకం భారీగా పెరుగుతుంది. దీంతో ప్రజలపై అదనపు భారం పడనుంది. వంట నూనెల ధరలు పెరగడంతో సామాన్యుల్లో ఆందోళన వ్యక్తం అవుతోంది.

సామాజిక హింసకు పాల్పడిన

అందరిపైనా కేసు నమోదు చేయాలి

గోవిందమ్మను పరామర్శిస్తున్న నాయకులు

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్న
- బాధిత గోవిందమ్మకు పరామర్శ

పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో సామాజిక హింసకు పాల్పడిన అందరిపైనా కేసు నమోదు చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, డివైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రామన్న, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్.దేవసహాయం డిమాండ్ చేశారు. ఆధిపత్య కులాల చేతిలో దాడికి గురైన మాదిగ గోవిందమ్మను ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రిలో బుధవారం పరామర్శించి, అనంతరం కల్లుకుంట గ్రామంలో ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఎస్సీలతో మాట్లాడారు.

కల్లుకుంట గ్రామంలో దళిత గోవిందమ్మపై కొనసాగిన దుశ్శాసన పర్వంపై సుమోటోగా స్వీకరించి అందరిపై కేసు నమోదు చేయించాలని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ రంజిత్ బాషను కలిసి సమస్యను వివరించారు.

కర్నూలు కమిషనర్‌గా రవీంద్రబాబు

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్‌గా బుధవారం ముచ్చటగా మూడోసారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు నగర ప్రజలకు సేవలు చేసే భాగ్యం మరోసారి లభించినందుకు ఆనందంగా ఉందన్నారు. డ్రెయినేజీ వ్యవస్థ, పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి మొదటి ప్రాధాన్యత క్రమంగా చేస్తానన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు కావాల్సిన అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. అధికారులకు బదిలీలు సర్వసాధారణం. ప్రాధాన్యత క్రమంగా పనులను చేస్తానన్నారు. నగరంలో మిగిలిపోయిన పనులన్నిటిపై శ్రద్ధ వహిస్తానన్నారు. కర్నూలు నగరానికి ప్రధానంగా తాగునీటి సరఫరా కోసం రిజర్వాయర్ కెపాసిటీలను అధ్యయనం చేసి ప్రజలకు తాగినీటి అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తానన్నారు. శానిటేషన్ లో ప్రధానంగా పట్టి పీడించే సమస్య ప్లాస్టిక్ వాడకం దాన్ని నివారించేందుకు కృషి చేస్తానన్నారు. ఈనెల17 నుండి కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం పై ప్రత్యేక చూపాల్సిన అవసరం ఉంది. మహాత్మా గాంధీ స్వాతంత్ర సాధనకన్నా పరిశుభ్రత ముఖ్యమని అన్నారు. మహాత్మా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం నిర్దేశించిన పనులలో రోజుకో కార్యక్రమాన్ని చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అందరి సహాయ సహకారాలతో కర్నూలు నగరాన్ని అందంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్

కర్నూలు వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా ఆర్.జయలక్ష్మి

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు వ్యవసాయ మార్కెట్ సెలెక్షన్ గ్రేడ్ కార్యదర్శి గా ఆర్ .జయలక్ష్మిని బదిలీ చేస్తూ అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిషనర్ విజయ సునీత ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం జయలక్ష్మి అనంతపురం మార్కెట్ లో విధులు నిర్వహిస్తున్నారు. త్వరలో కర్నూలు వ్యవసాయ మార్కెట్ సెలెక్షన్ గ్రేడ్ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకోనున్నారు. ప్రస్తుత కార్యదర్శి గోవిందును అనంతపురం బదిలీ చేశారు.

విశాలక్ష్మమ్మకు సిపిఎం, సిపిఐ నాయకుల నివాళి

ప్రజాశక్తి-పత్తికొండ : పత్తికొండ మాజీ ఎమ్మెల్యే ఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి కోడలు విశాలక్ష్మమ్మ మృతి పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ వారి స్వగ్రామమైన ఎర్రగుడిలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.రామ చంద్రయ్య, సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు గౌస్ దేశాయ్, గిడ్డయ్య, జిల్లా నాయకులు రాధాకృష్ణ, రామకృష్ణ, నారాయణ, వీరశేఖర్, టి.నరసింహ, రాజాసాహెబ్, రంగారెడ్డి, శ్రీరాములు, కొండారెడ్డిలు విశాలక్ష్మమ్మ అంత్యక్రియలో పాల్గొని నివాళులర్పించారు. ప్రభాకర్ రెడ్డి, రామచంద్రయ్య మాట్లాడుతూ విశాలక్ష్మమ్మ మరణం బాధాకరమని, ఆ కుటుంబానికి సానుభూతి తెలియజేస్తూ మనోధైర్యంగా ఉండాలని పేర్కొన్నారు.

నేటి నుంచి ఆన్‌లైన్‌లో ఇసుక

- రంగం సిద్ధం చేసిన మైనింగ్ అధికారులు - తహశీల్దార్ కార్యాలయాలు, సచివాలయాల్లో బుకింగ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఏర్పాటయ్యాక నూతన ఇసుక పాలసీ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. తొలుత ఇసుక బుకింగ్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఈ విధానంతో ఇసుక కోసం లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఇలాంటి ఇబ్బందులకు చెక్ పెడుతూ ఇసుక కొనుగోలుదారులకు అందుబాటులో ఉండే విధంగా ఆన్‌లైన్ బుకింగ్ విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

జిల్లావ్యాప్తంగా ఉన్న ఐదు ఇసుక రీచుల్లో గురువారం నుంచి ఆన్‌లైన్ ఇసుక బుకింగ్‌కు చర్యలు చేపట్టారు. గతంలో జిల్లాలో ఇసుక కొనుగోలుకు ప్రజలు మైనింగ్ శాఖ వద్ద టోకెన్ల కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చేది. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 11 రీచ్‌లో ఉండగా వీటి నిర్వహణ కోసం పర్యావరణ అనుమతులు రాకపోవడంతో ఇసుక సరఫరా ప్రభుత్వానికి చాలా ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం జిల్లాలోని ఐదు ఇసుక డీసిల్టింగ్ పాయింట్ల వద్ద ఇసుక విక్రయాలు సాగుతున్నాయి. ప్రజల డిమాండుకు అనుగుణంగా ఇసుకను అందించలేకపోతున్నారు. ఇసుక రీచ్ లో తవ్వకాలకు అనుమతులు లేకపోవడంతో ఇసుక కొరతను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా తుంగభద్ర బ్యారేజ్ దిగువన, సుంకేసుల డ్యాం ఎగువన డీసిల్టేషన్ పాయింట్లను ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న ఇసుక రీచుల్లో ఇప్పటివరకు 20 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను తోడారు. సి.బెళగల్ మండల పరిధిలో కొత్తకోట, సింగవరం, ఈర్లదిన్నె ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టారు. వీటికి అదనంగా ముడుమాల, పల్లెదొడ్డి రీచుల్లో 3.57 లక్షల టన్నుల ఇసుక తవ్వకాలకు పర్యావరణ శాఖ నుంచి అనుమతులు లభించాయి. గుడికంబాలి, నదిచాగి, మరళి గ్రామాల్లో 3.37 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాల అనుమతుల కోసం తాజాగా మైనింగ్ శాఖ పర్యావరణ శాఖకు లేఖ రాసినట్లు తెలుస్తోంది. అనుమతులు వస్తే ఈ రీచ్ లో నుంచి ఇసుకను యార్డులకు తరలించనున్నారు. జిల్లా అవసరాలకు అనుగుణంగా సరాసరిన రోజుకు 5వేల టన్నుల ఇసుక అవసరమవుతున్నట్లు మైనింగ్ శాఖ అధికారులు అంచనాలు రూపొందించారు. డీసిల్టేషన్ కోసం ఇప్పటికే బోట్‌మెన్స్ సొసైటీల నుంచి మైనింగ్ శాఖ దరఖాస్తులను ఆహ్వానించింది. మొత్తంగా ఎనిమిది సొసైటీలు ఆసక్తి చూపినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం రోజుకు మూడు వేల నుంచి నాలుగు వేల టన్నులు ఇసుకను వెలికి తీస్తున్నారు. పూర్తిస్థాయిలో డీసిల్టేషన్ ప్రక్రియ అందుబాటులోకి వస్తే తప్ప జిల్లాలో ఇసుక అవసరాలు తీరే పరిస్థితులు కనిపించడం లేదు. కాగా ప్రస్తుతం యార్డుల వద్ద విక్రయాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లను మైనింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే డీసిల్టింగ్ పాయింట్లలో సిసి కెమెరాలు, కంప్యూటర్లు, ప్రింటింగ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. యార్డుల వద్ద ఇంఛార్జీలను నియమించారు. ఉచిత ఇసుక పాలసీ అమలుకు సంబంధించి మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి ఒక్కొక్కరు చొప్పున అధికారులను ఎంపిక చేసి శిక్షణను కూడా పూర్తి చేశారు. ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఇసుకను బుకింగ్ చేసుకునేందుకు కర్నూలు రూరల్, పత్తికొండ, ఆదోని రెవెన్యూ డివిజన్లో గ్రామ సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయంలో ఇసుక బుకింగ్ అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నట్లు తెలుస్తోంది. ఇదే అమలయితే ప్రజలకు లైన్‌లో నిలబడి టోకెన్లు తీసుకునే ఇబ్బందుల నుంచి ఉపశమనం లభించనుంది.

జిల్లా గనులు భూగర్భ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇసుక రవాణా చార్జీల పట్టిక

మూడు గంటల నుంచి ప్రారంభం

జిల్లాలో ఇసుక ఆన్‌లైన్ అమ్మకాలు గురువారం మూడు గంటల నుంచి ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇసుక బుకింగులు అందుబాటులో ఉంటాయి. ఇసుక కొనుగోలుదారులు తహశీల్దారు కార్యాలయాలు, సచివాలయాల్లో బుకింగ్స్ చేసుకోవచ్చు.

- టి.రాజశేఖర్, గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్.

సీతరాం ఏచూరికి పిఎన్ఎం సంతాపం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

సిపిఎం అల్ ఇండియా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి, పిఎన్ఎం రాష్ట్ర కళాకారులు అభ్యుదయ రచయిత సన్యాసిరావులకు ప్రజానాట్యమండలి కర్నూలు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. బుధవారం ప్రజానాట్యమండలి కార్యాలయంలో ఏర్పాటుచేసిన సంతాప సభలో ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళలర్పించారు. పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఇ.నాగరాజు మాట్లాడుతూ అతిచిన్న తనంలోనే సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యుడి నుంచి అంచెలంచెలుగా ఎదిగి ప్రధాన కార్యదర్శిగా పని చేశారన్నారు. అనారోగ్యంతో మరణించడం పార్టీకి తీరని లోటని కొనియాడారు. అదేవిధంగా పిఎన్ఎం సీనియర్ కళా కారులు పి.ఏలీయా మాట్లాడుతూ ప్రజా కళాకారులు సన్యాసిరావు పేదప్రజల పట్ల అంకిత భావంతో పాటలను రాశారని, రాష్ట్ర మంతట ఎంతో మంది గాయకులను తయారు చేశారని అన్నారు. ఈకార్రమంలో పి. నోమేశ్వరి, బాలు, రాంబాబు, బతుకన్న, నాగ సుంకన్న, సరిత, లక్ష్మి, అక్షయ, లోకేష్ పాల్గొన్నారు.

వీరేష్‌కు ఎద్దుల మహేశ్వర రెడ్డి ఆర్థికసాయం

ప్రజాశక్తి-కోడుమూరు రూరల్

కోడుమూరు కోటవీధిలో నివసించే మంగలి వీరేష్ కొద్ది రోజులుగా పక్ష వాతంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని బుధవారం ఎద్దుల మహేశ్వర్ రెడ్డి తనవంతు మానవత్వంతో కుటుంబ ఖర్చుల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం సభ్యులు విజయ సారథి ద్వార సహాయం చేశారు.

వరదబాధితులకు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం టిడిపి నంద్యాల పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ రూ.ఒక లక్ష విరాళం అందజేశారు. మంగళవారం సాయంత్రం రూ.లక్ష నగదును పాణ్య ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డికి పార్వతమ్మ అందజేశారు. వరద బాధితులకు కష్టాలను గుర్తించి రూ.లక్ష వివాళం అందజేసిన పార్వతమ్మను గౌరుచరిత అభినందించారు.

జిజిహెచ్‌కు 5 ఎక్స్‌రే డిజిటల్ క్యాసెట్లు విరాళం

రెడ్డియాలజీ పూర్వ విద్యార్థులను అభినందన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు వైద్య కళాశాల రేడియాలజీ పూర్వ విద్యార్థులు ఫ్యూజి కంపెనీకి చెందిన 5 ఎక్స్‌రే డిజిటల్ క్యాసెట్లు విరాళంగా అందజేశారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ రేడియాలజీ విభాగపు పూర్వ పీజీ విద్యార్థులు, కర్నూలు రేడియాలజీ వైద్యుల సంఘం రూ. రెండు లక్షల 50 వేల విలువగల ఫ్యూజి కంపెనీకి చెందిన 5 ఎక్స్‌రే డిజిటల్ క్యాసెట్లు విరాళం అందజేశారని తెలిపారు. రేడియాలజీ విభాగంలో క్యాసెట్ల కొరత ఉందన్న విషయం తెలుసుకున్న సూపరింటెండెంట్ వెంటనే రేడియాలజీ పూర్వపు విద్యార్థులతో మాట్లాడి వారి సహకారంతో ఎక్స్‌రే డిజిటల్ క్యాసెట్లను డొనేషన్ రూపంలో ఆసుపత్రి రేడియాలజీ విభాగానికి అందజేసినట్లు తెలిపారు. ఆసుపత్రి రేడియాలజీ విభాగంలో ఎక్స్‌రే క్యాసెట్ల కొరతను అధిగమించి ఆసుపత్రికి వచ్చే పేషెంట్ల సౌకర్యార్థం వాటిని ఉపయోగించనున్నట్లు తెలిపారు. వాటి వలన పేషెంట్లకు ఎక్స్‌రేలు మరింత తొందరగా తీయడానికి వీలవుతుందని అన్నారు. ఆసుపత్రికి విరాళంగా ఇచ్చిన రేడియాలజీ పూర్వపు పీజీ విద్యార్థులు , రేడియాలజీ పూర్వపు వైద్యులకు మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయాన్ని ఇంకొంతమంది వైద్యులు స్ఫూర్తిగా తీసుకొని పీడియాట్రిక్ , గైనకాలజీ విభాగంలో కొన్ని పరికరాలు , వసతుల కల్పనకు ముందుకు రావలసిందిగా పూర్వ విద్యార్థులను కోరారు. విరాళాలు అంటే పెద్ద మొత్తంలోనే కాకుండా చిన్న చిన్న మొత్తంలో మనకు ఏవైతే పనికి వస్తాయో వాటిని ప్రజలకు అందించడం ద్వారా మనం చదువుకున్న ఆసుపత్రి రుణం తీర్చుకున్న వారు అవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రేడియాలజీ విభాగపు వైద్యులు, హెచ్ఒడి డాక్టర్ పద్మాలత, ప్రొఫెసర్ డాక్టర్ రాధారాణి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ హరినాథ్, కర్నూలు వైద్య కళాశాల రేడియాలజీ పూర్వ వైద్యులు డాక్టర్ జోజి రెడ్డి, డాక్టర్ సురేష్, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ రవికుమార్ సమన్, డాక్టర్ మహేష్ యాదవ్, డాక్టర్ అశోక్, డాక్టర్ రవితేజ, డాక్టర్ హనీఫ్, ఆసుపత్రి ఎఆర్ఎం ఒ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివ బాల నగాంజన్, డాక్టర్ కిరణ్ కుమార్, చీఫ్ రేడియో గ్రాఫర్ రామ్ సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌కు ఎక్స్‌రే డిజిటల్ క్యాసెట్లు అందజేస్తున్న రేడియాలజీ పూర్వ విద్యార్థులు

కుష్టు వ్యాధిగ్రస్తులకు ఎంసిఆర్ చెప్పల పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరం ఆదర్శ లేప్రసి కాలనీలో నివసిస్తున్న కుష్టు వ్యాధిగ్రస్తులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ అద్వర్యంలో ఎంసిఆర్ (మైక్రో సెల్యూలర్ రబ్బర్) చెప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుష్టు వ్యాదిగ్రస్తులకు సాదారణంగా స్పర్శ లేకపోవడం వలన వేడితగిలినా, ముల్లులు మొదలైనవి గుచ్చుకుని పాదాలకు గాయాలు అయ్యె అవకాసం ఉన్నదని తెలిపారు. అందువలన పాదాలకు రక్షణగా మైక్రోసెల్యూలర్ రబ్బర్ చెప్పులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని వాటిని వారు క్రమం తప్పక వాడేటట్లు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో టిహెచ్ వార్డు వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి, వీకస్ సెక్షన్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాదికారి డాక్టర్ శ్రీరాములు, ఫిజియోతెరపిస్ట్ రెడ్డిబాబు, డిపిఎంఒలు నారాయణరావు , సుబ్రహ్మణ్యం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ప్రమాద బీమా

- 9 తీర్మానాలకు నగరపాలక స్థాయీ సంఘం ఆమోదముద్ర
- ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటు.

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ప్రమాద బీమా చెల్లించాలని నగరపాలక స్థాయి సంఘ సమావేశం తీర్మానించింది. నగర మేయర్ బివై.రామయ్య అధ్యక్షతన బుధవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన స్థాయి సంఘం సమావేశానికి కమిషనర్ పి.వి. రామలింగేశ్వర్, సభ్యులు, అధికారులు హాజరయ్యారు. తొమ్మిది తీర్మానాలకు ఆమోదం తెలిపారు. సాధారణ నిధుల నుండి రూ.1,67,18,000 కోట్ల నిధుల వినియోగానికి స్థాయి సంఘం ఆమోదముద్ర వేసింది. నగరపాలక కార్పొరేటర్లకు, అధికారులకు, రెగ్యులర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బందికి, కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు బీమా వర్తించేలా రూ.520లతో జీవిత బీమా చేయడం, అలాగే రూ.45.50 లక్షలతో కార్మికులకు దుస్తులు, టవల్స్, చెప్పులు, నూనె, సబ్బులు సరఫరా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కింగ్ మార్కెట్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నందు లీజు కాలం ముగిసిన ఒక షాపు, ఖాళీ అయిన మరో షాపుకు బహిరంగ వేలంపాట నిర్వహణ, క్లాప్ ఆటో డ్రైవర్లకు 4 నెలల వేతనాల చెల్లింపు, ముఖ్య కూడళ్లలో సిసి కెమెరాల ఏర్పాటు వంటి తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో స్థాయి సంఘం సభ్యులు సభ్యులు ఎం.విక్రసింహారెడ్డి, యూనూస్ బాష, క్రాంతి కుమార్, జుబేర్, మిద్దె చిట్టమ్మ, ఆరోగ్యధికారి డాక్టర్ వి.విశ్వేశ్వర్ రెడ్డి, మేనేజర్ ఎన్.చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజు, ఎస్ఈ. వేణుగోపాల్, ఎంఈలు షాకీర్, శేషసాయి, ఆర్ఓలు జునైద్, ఇశ్రాయేలు, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్ పాల్గొన్నారు.

బ్యాంకర్లు సహకారం ఇవ్వాలి

జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ యూనిట్‌ల ఏర్పాటుకు బ్యాంకర్లు సహకరించాలని సంబంధిత బ్యాంక్ అధికారులను జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య ఆదేశించారు. బుధవారం జాయింట్ కలెక్టర్ బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పశుసంవర్ధ శాఖకు చెందిన నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ పథకం ద్వారా సొంతంగా యూనిట్ ఏర్పాటు చేసుకున్న వారికైనా, బ్యాంకుల నుండి లోను తీసుకున్న వారికైనా 50 శాతం సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఇప్పటిదాకా 32 మంది లబ్ధిదారులు ఉండగా 2 యూనిట్లు గ్రౌండ్ అయ్యాయన్నారు. ఎంఎల్‌డిఎం రామచంద్ర రావు, పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసులు, ఎస్సీ,ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్, దళిత్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కోఆర్డినేటర్ దిలీప్, బ్యాంక్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిలో కారు బోల్తా

పదిమందికి గాయాలు -ఇద్దరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-వెల్దుర్తి

బోల్తాపడిన ఇన్నోవా కారు

వెల్దుర్తి మండల పరిధి లోని 44వ జాతీయ రహదారి మాదాపురం గ్రామ సమీపంలో బుధవారం ఉదయం ఇన్నోవా కారు అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో పదిమంది గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల వివరాల ప్రకారం.. డోన్ పట్టణంలోని తారకరామ నగర్‌కు చెందిన మంగలి పరమేష్ అతని కుటుంబ సభ్యులు, బంధువులు కలిసి క్రిష్ణగిరి మండలం పుట్లూరు మారెమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలకు వెళ్లి ఇన్నోవా కారులో తిరిగి వస్తున్నారు. 44వ జాతీయ రహదారిలోని మాదాపురం గ్రామ సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను కారు ఢీ కొట్టింది. ముందుగా వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొని పక్కనే ఉన్న సర్వీసు రోడ్డులో బోల్తా పడింది. స్థానికులు గ్రామస్తుల సహాయంతో కారులో ఇరుక్కుపోయిన వారందరినీ బయటకు తీశారు. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు అంబులెన్స్‌లో స్థానికుల సహాయంతో వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తీవ్ర గాయాలైన వారిని మెరుగైన చికిత్స కోసం వెల్దుర్తి నుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇన్నోవా కారులో ప్రయాణించి గాయపడ్డ వారి వివరాలు డోన్ పట్టణానికి చెందిన ఇన్నోవా డ్రైవర్ మంగలి రాఘవేంద్ర, మంగలి పరమేష్ అతని తండ్రి రామలింగం అమ్మ వెంకటేశ్వరమ్మ , భార్య పార్వతమ్మ, సోదరి మౌనిక వారి పిల్లలు మోక్షిత్, జ్యోతి ఉన్నారు. బైకును ఢీకొనడంతో బైక్ పైనుంచి కిందపడి గాయపడిన వారు ప్రయివేటు పెస్టిసైడ్ కంపెనీలో పనిచేసే ప్యాపిలి మండలం చిన్నపూజర్ల గ్రామానికి చెందిన ప్రవీణ్, కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన తెలుగు శంకరు ఉన్నారు. వారిలో 11 ఏళ్ల మోక్షత్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంకటేశ్వరమ్మకి చేతి మణికట్టు తెగిపోయి తీవ్ర రక్తస్రావం అయింది. వారిద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. వెల్దుర్తి పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

కౌతాళం విద్యార్థికి ఎంబిబిఎస్ సీటు

- నీట్ ఫలితాల్లో మెడికల్ సీటు సాధించిన గాయత్రి

ప్రజాశక్తి - కౌతాళం

అక్షరాస్యతలో రాష్ట్రంలోనే అత్యంత వెనుకబడిన మండలాల్లో ఒకటైన కౌతాళం నుంచి ఓ విద్యార్థిని ఎంబిబిఎస్ సీటు సాధించారు. నీట్ ఫలితాల్లో ఉచిత మెడికల్ సీటు సాధించిన ఘనత గాయత్రికి దక్కింది. కౌతాళం మండలం బాపురం గ్రామానికి చెందిన విద్యార్థిని గాయత్రి మెడికల్ సీటు సాధించారు. ఉపాధ్యాయులుగా సేవలందిస్తున్న బిడి.రంగన్న, అనంతలక్ష్మి దంపతుల కుమార్తె గాయత్రి. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో 562/720 మార్కులు సాధించారు. స్టేట్ ర్యాంకు 5,094, ఆల్ ఇండియా ర్యాంకు 1,21,690 సాధించారు. ఆమెకు అనంతపురం గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ సీటు లభించింది. గాయత్రి ఎంబిబిఎస్ సీటు సాధించడం మండలానికి గర్వకారణమని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు విద్యార్థినికి అభినందనలు తెలుపుతున్నారు. ఇంతటి ఘనత సాధించడం బాపురం గ్రామానికే గర్వకారణమని గ్రామ నాయకులు వారి కుటుంబ సభ్యులకు బుధవారం అభినందలు తెలిపారు.

ప్లాటినం జూబ్లీ వేడుకలకు విరాళం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విరాళం అందిస్తున్న తిక్కా రెడ్డి

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు టిడిపి జిల్లా అధ్యక్షులు పి.తిక్కా రెడ్డి రూ.లక్ష విరాళంగా అందించారు. బుధవారం స్థానిక తిక్కారెడ్డి నివాసంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్కూల్ మహా సమ్మేళనం నిర్వాహకులు మాచాని వెంకటేష్, మాచాని శివ కుమార్, క్రాంతి టెక్స్‌టైల్స్ ప్రకాష్ జైన్‌లు కలిసి ప్లాటినం జూబ్లీ వేడుకలకు హాజరు కావాలని ఆహ్వానించారు. అలాగే రూ.లక్ష విరాళం తిక్కారెడ్డి అందజేశారు. ఈనెల 29న జరిగే మహా సమ్మేళానికి ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

- చంద్రబాబుకు చెక్కును అందించిన రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

చెక్కు అందజేస్తున్న రాఘవేంద్ర రెడ్డి

వరద బాధితులకు సహాయార్థం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రూ.21.80 లక్షల చెక్కును అందజేశారు. బుధవారం ఆయన మాట్లాడారు. వరద బాధితుల కోసం నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి టిడిపి నాయకులు గ్రామాల్లో సేకరించిన నిధులను చెక్కు రూపంలో అందించినట్లు పేర్కొన్నారు. ఆగిపోయిన ఆర్‌డిఎస్ రూ.2 వేల కోట్ల ప్రాజెక్టును మొదలు పెట్టాలని, గురు రాఘవేంద్ర లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు రూ.4.27 లక్షలు కేటాయించాలని, నియోజకవర్గంలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ అంశాలపై మంత్రి నారా లోకేష్ కౌతాళం మండల నాయకులు చూడి ఉలిగయ్యతో చర్చించారు.

చిప్పగిరిలో ఆర్‌డిటి గృహాలు ప్రారంభం

- రూ.1.21 కోట్ల సహకారం

- ఆర్‌డిటి హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - చిప్పగిరి

ఆర్‌డిటి ప్రతినిధులను సన్మానిస్తున్న కాలనీ వాసులు

చిప్పగిరి ఎస్సీ కాలనీలో 38 ఆర్‌డిటి గృహాలను హౌసింగ్ ఆర్‌డిటి డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, ఆర్‌డిటి స్పానింగ్ మిత్ర బృందం 17 మందితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలూరు తాలూకా ఏరియా కోఆర్డినేటర్ హనుమంతప్ప, కోఆర్డినేటర్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఆర్‌డిటి సంస్థ ప్రతినిధులు, స్పాన్సర్స్ కాలనీ వాసులతో ఆర్‌డిటి కమ్యూనిటీ హాలులో సమావేశం నిర్వహించారు. ప్రతి గృహంలో విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటాన్ని ఉంచి పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్‌డిటి సంస్థ అంటే విన్సెంట్ ఫెర్రర్ గుర్తుకొస్తారని తెలిపారు. చిప్పగిరిలో 38 ఆర్‌డిటి గృహాలకు రూ.1,21,60,000 అందజేసినట్లు చెప్పారు. అనంతరం ఆర్‌డిటి ప్రతినిధులను కాలనీవాసులు కరెంటు గోవిందు, నారాయణస్వామి, మల్లయ్య, మల్లికార్జున డప్పులు వాయిద్యాలతో స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో సన్మానించారు.

మెడికల్ కళాశాల పనులు ప్రారంభించాలి

- సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్

- ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన మెడికల్ కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ డిమాండ్ చేశారు. మెడికల్ కళాశాల కోసం ఉద్యమం తీవ్రతరం చేసే దశలో భాగంగా బుధవారం ఆదోనిలో రెవెన్యూ భవన్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కర్నూలు పశ్చిమ ప్రాంతమైన ఆదోని డివిజన్ అన్ని రంగాల్లోనూ వెనుకబడి ఉందని తెలిపారు. మెడికల్ కళాశాల మంజూరు కావడంతో కొంతవరకైనా విద్యాపరంగా రాణించేందుకు అవకాశం ఏర్పడుతుందని అందరూ భావించారని చెప్పారు. అది నెరవేరని పరిస్థితి ఉందన్నారు. వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం ఛిద్రం చేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవిశెట్టి ప్రకాష్, సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, వైసిపి నాయకులు దేవదాస్, బీఎస్పీ అధ్యక్షులు ఫయాజ్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ సత్తన్న, జైభీమ్ నాయకులు గిరిజన, బీసీ సంఘం నాయకులు దస్తగిరి నాయుడు, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు సూరి, పట్టణ కార్యదర్శి గౌస్, నాయకులు శశిధర్, రాజు, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, పిడిఎస్‌యు రాష్ట్ర నాయకులు నాగరాజు, బిడిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ రమేష్, ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్, పిడిఎస్ఒ రాష్ట్ర నాయకులు తిరుమలేష్, డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్, వైఎస్ఆర్ఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి లింగప్ప సంఘీభావం తెలిపి మాట్లాడారు. విద్యను హక్కుగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని తెలిపారు. బాధ్యతను మరిచి వైద్య విద్యను ప్రయివేట్‌కు కట్టబెట్టడం దుర్మార్గమని దుయ్యబట్టారు. కేంద్రంతో సంప్రదించి 5 కళాశాలలకు అనుమతులు తీసుకురావాల్సిన ప్రభుత్వం పులివెందులకు వచ్చిన 50 సీట్లు కూడా వసతులు కల్పించలేమని ఎన్ఎంసికి లేఖ రాయడం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క పాడేరుకే 50 సీట్లు వచ్చాయని, మిగిలిన 4 కళాశాలలకు నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఒపి ఇచ్చి ఉంటే అనుమతులు లభించి ఉండేవని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యపు చర్య వల్ల వైద్య విద్యార్థులు 700 సీట్లు కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయివేటీకరణ జరిగితే పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రయివేట్ పరమైతే రిజర్వేషన్ల ఊసే ఉండదని, వెనుకబడిన తరగతుల విద్యార్థులకు నష్టం జరుగుతుందని చెప్పారు. భవిష్యత్తులో ఉచిత వైద్య సేవలు కూడా పేద ప్రజలకు అందవని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య విద్య ప్రయివేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలని, ఎన్ఎంసికి రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. మెడికల్ కళాశాల భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసి, ఉచిత వైద్య విద్యను అందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన బాట పడతామని హెచ్చరించారు.

మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్

రాచరికం పోయే..!

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బ్రిటీష్ వారసత్వ రాచరిక వ్యవస్థకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో స్వస్తి పలికారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉండే ప్రత్యేక ఛాంబర్, రెయిలింగ్ వంటివన్నీ తొలగించేలా అధికారులు చర్యలు చేపట్టారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోదియా జారీ చేసిన ఆదేశాలతో ఈ మార్పులు మొదలయ్యాయి. ఇప్పటివరకు సబ్ రిజిస్ట్రార్ పోడియం ఎత్తుగా, అక్కడ చెక్కలతో కూడిన రెయిలింగ్ ఉండేది. అందులో సబ్ రిజిస్ట్రార్ ఎత్తులో కూర్చునే వారు. క్రయ, విక్రయాలకు వచ్చిన వారు ఎవరైనా సరే సబ్ రిజిస్ట్రార్ ముందు నిల్చొని ఉండాల్సిందే. ఇప్పుడిదంతా మారుస్తున్నారు.

మార్పు తర్వాత

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రాచరిక వ్యవస్థ ఆనవాళ్లు తొలగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సబ్ రిజిస్ట్రార్ పోడియం తొలగించే పనులు ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేపట్టారు. ఆదోనిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు స్పందించారు. కార్యాలయంలో మొన్నటి వరకు ఉన్న పెద్ద పెద్ద బల్లలు, హద్దులు తొలగించారు. మిగిలిన ఉద్యోగుల్లా సాధారణ బల్లలు వేసుకుని విధులు నిర్వర్తించారు. గత నిబంధనలతో ప్రజలు ఇబ్బందులు పడేవారు. ప్రస్తుతం స్వేచ్ఛగా అధికారులతో మాట్లాడే అవకాశం కలుగుతుందని రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చే ప్రజలు పేర్కొంటున్నారు.

కూర్చోబెట్టి నీరు, టీ ఇచ్చి

అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోని అధికారుల మాదిరిగానే సబ్ రిజిస్ట్రార్లు కూడా కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎత్తయిన కుర్చీని తొలగిస్తున్నారు. వారి ముందు సామాన్యులూ కూర్చునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. క్రయ, విక్రయదారులు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తే వారికి తాగునీరు అందించడంతో పాటు వీలైతే టీ, కాఫీ అందించాలని మెమోలో పేర్కొన్నారు.

సాధారణ కుర్చీలో ఉన్న సబ్ రిజిస్ట్రార్

ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో
23, 24న ఎద్దుల బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో శ్రీశ్రీచింతలముని నల్లారెడ్డి స్వాముల వారి దశమి సందర్భంగా గోనెగండ్ల ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 23, 24న ఒంగోలు జాతి రాష్ట్రస్థాయి ఎద్దుల బండ బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. బుధవారం సర్పంచి భర్త, అడ్వకేట్ వెంకటేశ్వర్లుతో కలిసి పోటీల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ యూనియన్ సభ్యులు కె.హుస్సేన్, రాంపురం లాలు, మాబు, వెంకటేష్, సాయిబాబా, నూర్ అహ్మద్, రహంతుల్లా, రాజు, సుధాకర్, సి.ఈరన్న మాట్లాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు. 23న ఉదయం 8 గంటల నుంచి 24న సాయంత్రం వరకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు న్యూ కేటగిరి కింద మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.5 వేలు అందజేయనున్నట్లు తెలిపారు.

ఆరుపండ్ల సైజ్ ఎద్దుల బహుమతులు

మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు, ఆరో బహుమతి రూ.3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు న్యూ కేటగిరి ఎద్దులకు ప్రవేశ రుసుం రూ.700, ఆరు పండ్ల సైజ్ ఎద్దులకు రూ.600 ప్రవేశ రుసుం చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఒక జత ఎద్దుల ప్రదర్శనకు వచ్చిన 10 మందికి ఉచిత భోజన వసతి ఉందన్నారు. ఇతర వివరాలకు గాజుల కుమారస్వామి 8247489945, 9949151807 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.



కరపత్రం విడుదల చేస్తున్న ట్రాక్టర్ యూనియన్ సభ్యులు

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE (JUNIOR DIVISON) ADONI
O.S. No: 25/2024

Between:
Mohammed Aslam. ...PLAINTIFF
Verses
P.Narasappa. ...DEFENDANT

SUMMONS TO DEFENDANT

TO,
P.Narasappa, S/o Basaiah, Hindu aged about 60, years, Resident of H.No: 3/3 Madhavaram village Mantralayam Mandal - Kurnool Dist.

Whereas the above-named Plaintiff filed the above Original Suit against you to pass for declaration of easement right to use and enjoy the 14 feet existing cart rastha from your lands to reach his Plaint schedule land. You are hereby order to take summons and appear before this court at 10:30. AM., on 26/09/2024 in person or through advocate and file your objections if any. Else you will be set Exparte and the above Original Suit will be decided in your absence.

// By Order of the Court //
Sri Syed Khader Basha,
Advocate for Plaintiff,
Adoni

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE (JUNIOR DIVISON) ADONI
I.A. No: 14/2024
IN
O.S. No: 25/2024

Between:-
Mohammed Aslam. ...PETITIONER
Verses
P.Narasappa. ...RESPONDENT
TO

SUMMONS TO RESPONDENT

P. Narasappa, S/o Basaiah, Hindu aged about 60 years, Resident of H.No: 3/3 Madhavaram village Mantralayam Mandal - Kurnool Dist.

Whereas the above-named Petitioner filed the above petition against you to grant ad-interim injunction from obstructing the Petitioner to use and enjoy the 14 feet existing card rastha, through your lands. You are hereby order to take summons and appear before this court at 10:30. AM., on 26/09/2024 in person or through advocate and file your objections if any. Else you will be set Exparte and the above petition will be decided in your absence.

//By Order of the Court //
Sri Syed Khader Basha,
Advocate for Petitioner,
Adoni

విద్యుత్ శాఖలో మాయాజాలం

- వేతనాలు నిలిపినా విధులు నిర్వహిస్తున్న ఇంజినీర్లు

ప్రజాశక్తి - ఆదోని

ఒక్క నెల వేతనం జమ కాకుంటే సామాన్య ఉద్యోగి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవడం సహజం. విద్యుత్ శాఖలో మాత్రం నెలల తరబడి వేతనాలు నిలిపినా లగ్జరీగా ఇంజినీర్లు విధులు నిర్వహిస్తున్నారు. వేతనాలు నిలిపినా ఇంజినీర్లు కుటుంబాలను ఎలా పోషించుకుంటున్నారో అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వేతనాలు నిలిపినా సమస్యను పరిష్కరించుకునేందుకు కూడా ఎవరూ ప్రయత్నించడం లేదా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 'ఇదేమి మాయాజాలం' అంటూ పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు.

ఆదోని డివిజనల్ విద్యుత్ శాఖ పరిధిలో అదనపు డిప్యూటీ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఇంజినీర్లు కొన్ని నెలలుగా వేతనాలు జమ కాకున్నా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగులు కొందరు కాంట్రాక్టర్లకు కొమ్ముకాస్తున్నట్లు కూడా అనుమానాలు ఉన్నాయి.

వేతనాల నిలిపివేత ఇలా

విద్యుత్ శాఖలో కేటాయించిన ప్రదేశాల్లో విద్యుత్ లైన్ల మార్పిడి, కొత్త లైన్ ఏర్పాటు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, ఇతరత్రా పనులకు సంబంధించిన వర్క్ ఆర్డర్లు పూర్తి చేయాల్సి ఉంది. చాలాకాలంగా వర్క్ ఆర్డర్లు పూర్తి చేయకపోవడంతో చర్యల్లో భాగంగా మండల, తాలూకా స్థాయి ఇంజినీర్లకు కొన్ని నెలలుగా వేతనాలు నిలిపివేశారని ఉద్యోగులు తెలుపుతున్నారు. వేతనాలు లేకున్నా ఇంజినీర్లు మాత్రం వాహనాల్లో రాకపోకలు సాగిస్తూ దర్జాగా విధులు నిర్వహిస్తున్నారు. నెలవారీ ఖర్చులు, కుటుంబ పోషణ, బ్యాంకు ఈఎంఐ, పిల్లల ఫీజులు, ఆరోగ్య సమస్యలు తదితర వాటికి డబ్బు అవసరం ఉంటుంది. ఈ పరిస్థితుల్లో వారు ఎలా నెట్టుకొస్తున్నారో వారికే తెలియాలి. వారి పరిధిలోనే పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు కాంట్రాక్టర్లు వారికి ఆర్థికంగా సహకరిస్తున్నట్లు కూడా ఉద్యోగులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి విద్యుత్ శాఖలో జరుగుతున్న మాయాజాలంపై నిగ్గు తేర్చాలని సామాన్య ఉద్యోగులు కోరుతున్నారు. ఇదే విషయాన్ని విద్యుత్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా దాటవేశారు.

మహారాజశ్రీ కర్నూలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఐ.పి.నెం.38/2022

దాసి బాల వెంకటరెడ్డి ... అర్జీదారు
-వర్సెస్-
కొత్తపల్లి వెంకటశివయ్య మరియు వగైరా ...రెస్పాండెంట్లు

3వ రెస్పాండెంటుకు నోటీసు

3) గనప.నాగరాజు తండ్రి జి.ఎల్లప్ప, ఇంటి.నెం.81/277,రామక్రిష్ణనగర్, కర్నూలు టౌన్.

పై నెంబరులో ఐ.పిలో అర్జీదారు దాసి బాల వెంకటరెడ్డి తండ్రి లేటు దాసి శేశిరెడ్డి, నివాసం. ప్లాటు నం.206,ధరణిసాయి అపార్టుమెంటు, యస్.బి.ఐ.బ్యాంకు దగ్గర, కేశవరెడ్డిస్కూల్ గ్రౌండు, కర్నూలు అను నతడు తనను దావాళాదారుగా తీర్మానించమని కోరుతూ పై కోర్టులో ఐ.పి అర్జీ దాఖలు చేసినది. ఇందుపైన 3వ రెస్పాండెంటు అయిన నీకు ఏమైన అక్షేపణలు వున్న యెడల 23-09-2024వ తేది పగలు 10.30 గం.లకు పై కోర్టులో మీరుకాని మీ తరుపు న్యాయవాదికాని హాజరై మీకు గల అభ్యంతరములు తెలుపుకోవలెను. లేనియెడల మీపరోక్షమున పై అర్జీని విచారించి తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేడమైనది.

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది: 23-09-2024

వై.రణ్‌దీప్‌కుమార్‌రెడ్డి
జి.భరత్‌కుమార్,
అర్జీదారు తరుపు న్యాయవాదులు.
కర్నూలు.

ఖరీఫ్ పంటలను నమోదు చేయించుకోవాలి : ఎఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో విత్తనం వేసుకున్న ప్రతి రైతూ ఈ-క్రాప్ యాప్‌లో పంట నమోదు చేయించుకోవాలని ఎఒ జయలక్ష్మి తెలిపారు. బుధవారం చిప్పగిరి రైతు సేవా కేంద్రంలో ఆమె మాట్లాడారు. మండలంలో ఖరీఫ్‌లో విత్తనం వేసిన రైతులందరూ పట్టాదారు పాసుపుస్తకం, వన్ బి అడంగల్, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింకప్ అయిన బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలను రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు అందజేసి పంట నమోదు చేయించుకోవాలన్నారు. నమోదు చేసుకోవడానికి ప్రభుత్వం ఈనెల 30 వరకు గడువు ఇచ్చిందన్నారు. కౌలు రైతులకు కూడా పైన పేర్కొన్న జిరాక్స్ కాపీలతో పాటు సిసిఆర్‌సి కార్డు తప్పనిసరిగా జత చేయాలని తెలిపారు. నమోదు చేయించుకున్న రైతులకే ప్రభుత్వం అందించే రాయితీలు వర్తిస్తాయన్నారు. ఎఇఒ రమాదేవి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు రంగస్వామి, ప్రతాప్ నాయుడు పాల్గొన్నారు.

కెవిపిఎస్ మండల కార్యదర్శిగా చిన్న మారయ్య

ప్రజాశక్తి - కౌతాళం

కెవిపిఎస్ మండల కార్యదర్శిగా చిన్న మారయ్యను ఎన్నుకున్నారు. బుధవారం సిపిఎం కార్యాలయంలో మండల మహాసభ తాయప్ప అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. నేటికీ కొన్ని ప్రాంతాల్లో కులవివక్ష కొనసాగుతోందని, వాటిపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. అంతకు ముందు సిపిఎం జెండాను ఆవిష్కరించారు. కెవిపిఎస్ గౌరవాధ్యక్షులు మల్లయ్య, ఈరన్న పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

ప్రజాశక్తి - ఆదోని

విజయవాడ వరద బాధితుల సహాయార్థం తమ కళాశాలల విద్యార్థులతో విరాళాల సేకరణ చేయించామని విశ్వనారాయణ జూనియర్, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున తెలిపారు. సేకరించిన మొత్తాన్ని బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పలువురి నుంచి వరద బాదితుల సహాయార్థం పట్టణంలో మూడు రోజులుగా విద్యార్థులు విరాళాల సేకరణ చేపట్టారని తెలిపారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.21,500 చెక్కు రూపంలో అందజేశామన్నారు. సామాజిక దృక్పథం కలిగిన విద్యారులను, ఉపాధ్యాయులను ఎమ్మెల్యే పార్థసారథి అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కోరారు. బుధవారం ఏక్ పెడ్ మాకే నామ్‌లో భాగంగా జోగి కాలనీ, ఆదోని బైపాస్ రోడ్డులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని 17 రోజులపాటు పట్టణంలో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 16న ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ జరిగేలా అవగాహన కల్పించినట్లు చెప్పారు. 17న స్వచ్ఛతపై మెగా ర్యాలీ, 18న ఏక్ పెడ్‌కే నామ్ (చెట్లు నాటే కార్యక్రమం) పూర్తి చేశామన్నారు. 19న స్వచ్ఛత కార్యక్రమాలపై రిసోర్స్ పర్సన్స్‌తో అవగాహన సదస్సు, 20న సింగిల్ యూస్ ప్లాస్టిక్‌పై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 21న శానిటేషన్ కార్యక్రమాలు సెల్ఫీ పాయింట్ ఏర్పాటు, 22న స్వచ్ఛతపై విద్యార్థులతో నృత్య ప్రదర్శన, 23న ఫుడ్ స్ట్రీట్, వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ఓం శాంతి సర్కిల్ వరకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. 24న హెచ్‌బిఎస్ కాలనీలో మెగా క్లీన్ నెస్ డ్రైవ్, 25న చెత్తను స్వీకరించే వాహనాల సర్వీసింగ్, 26న కమ్యూనిటీ టాయిలెట్స్, పబ్లిక్ టాయిలెట్స్‌ను శుభ్రం చేయించనున్నట్లు తెలిపారు. 27న వెంకట సాయి దేవాలయం, అయ్యప్ప స్వామి దేవాలయం, అన్నమయ్య సర్కిల్ శుభ్రత కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. అక్టోబర్ 2 వరకు రోజూ ఓ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

మొక్కలు నాటుతున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

మహానంది కుటుంబానికి అండగా ఉంటాం : జనసేన

ప్రజాశక్తి - ఆస్పరి

జనసేన కార్యకర్త మహానంది కుటుంబానికి అండగా ఉంటామని జనసేన నాయకులు తెలిపారు. ఆస్పరికి చెందిన జనసేన కార్యకర్త మహానంది తల్లి పెద్ద సంజమ్మ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ వెంకప్ప ఆదేశాల మేరకు జనసేన మండల కన్వీనర్ అరవింద్ సంజమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆర్థిక సహాయంగా రూ.20 వేలు అందజేశారు. జనసేన మండల ఉపాధ్యక్షులు శివ, నాయకులు శ్రీనివాసులు, రంజిత్, మహేష్, ప్రసాద్, విష్ణు, మధు పాల్గొన్నారు.

పీఠాధిపతుల చాతుర్మాస దీక్ష విరమణ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు చేపట్టిన చాతుర్మాస దీక్షను బుధవారం విరమించారు. ఆగస్టు 2న చేపట్టిన కొండాపురం ఆంజనేయస్వామిని దర్శించుకొని దీక్షను విరమించారు. సుమారు 45 రోజుల పాటు శ్రీమఠంలో ఉంటూ విశేష పూజలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, ఆరాధన మహోత్సవాలను విజయవంతం చేశారు. పీఠాధిపతులను ప్రత్యేకంగా విద్యుద్దీపాలతో అలంకరించిన వాహనంలో పురవీధుల్లో శ్రీమఠం వరకు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా ఊరేగించారు. అడుగడుగునా పీఠాధిపతులకు శ్రీమఠం సిబ్బంది, దుకాణాలు, హోటళ్ల యజమానులు, గ్రామ ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. రోడ్డుపై ప్రత్యేకంగా బల్ల పరుపులను, తివాచీలపై వివిధ రకాల పూలు వేసి పూల వర్షం కురిపించారు.

ముగిసిన క్లస్టర్ స్థాయి కళా ఉత్సవాలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

జవహర్ నవోదయ విద్యాలయంలో క్లస్టర్ స్థాయి కళా ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. నవోదయ విద్యాలయలో ఈనెల 17, 18న నిర్వహించిన కళా ఉత్సవాలకు రాష్ట్రంలోని 16 నవోదయ విద్యాలయ విద్యార్థులు హాజరయ్యారు. రెండో రోజు 8 నవోదయ విద్యాలయాల విద్యార్థులు ప్రదర్శనలతో ఆకొట్టుకొన్నారు. ఈ సందర్భంగా జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఇ.పద్మావతి మాట్లాడారు. లలిత కళలతో విద్యార్థుల్లో మానసిక ఆనందం పెంపొందుతుందని తెలిపారు. పిల్లలకు కళలను అలవాటు చేయడం మంచిదని, పిల్లలు ఆరోగ్యంగా ఎదగాలంటే చదువుతో పాటు కళలు కూడా అలవాటు చేయాలని సూచించారు. ఇక్కడ ఎంపికైన విద్యార్థులకు ప్రాంతీయ స్థాయి ఎంపిక పోటీలు జెఎన్‌వి కోజికోడ్ (కేరళ)లో జరుగుతాయని తెలిపారు. న్యాయ నిర్ణేతలుగా నెల్లూరు జెఎన్‌వి నుంచి జేమ్స్ (ఆర్ట్ టీచర్), కర్నూలు ప్రభుత్వ సంగీత శారద కళాశాల నుంచి శ్రీకిరణ్ (వోకల్ విధ్వాంసుడు), ఎమ్మిగనూరు నుంచి నాగరాజు (డ్యాన్స్ మాస్టర్), ఎమ్మిగనూరు జెఎన్‌వి విద్యాలయ వైస్ ప్రిన్సిపల్ కె.చందిరన్ వ్యవహరించారు. బసవరాజ్, జగన్నాథ్, శిరీష, శ్రీనివాసరావు, శివాజీ రావు, వెంకటయ్య, మీనా చంద్రన్, శశికిరణ్, అంజలి, నీలవేణి, సంజీవ్ కుమార్, సత్యనారాయణ మాలి, వెంకటేష్, సునీత, నబి, రామదాసు, భాస్కర్ పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనను తిలకిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

సిపిఐ సీనియర్ నాయకులు చిన్న రామకృష్ణ మృతి

ప్రజాశక్తి - ఆలూరు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కాక రామకృష్ణ సోదరులు, సిపిఐ సీనియర్ నాయకులు కాక చిన్న రామకృష్ణ బుధవారం అనారోగ్యంతో తన నివాసంలో మృతి చెందారు. తన సోదరులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అడుగుజాడల్లో నడుస్తూ నియోజకవర్గంలో సిపిఐ అభివద్ధికి కృషి చేశారని నాయకులు కొనియాడారు. రైతుసంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా, జిల్లా సిపిఐ నాయకులుగా సేవలందించిన చిన్న రామకృష్ణ ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. చిన్న రామకృష్ణ మృతి పార్టీకి, తమ కుటుంబానికి తీరని లోటని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, చిన్న సోదరుడు భూపేష్ తెలిపారు. చిన్న రామకృష్ణ మృతదేహానికి నివాళులర్పించారు. సిపిఐ నాయకులు రామచంద్రయ్య, గిడ్డయ్య, టిడిపి నాయకులు మనేకుర్తి రాజశేఖర్, గ్రామంలోని టిడిపి నాయకులు, మాజీ సర్పంచి రంగస్వామి, అశోక్ యాదవ్, రామనాథ్ యాదవ్, సర్పంచి మోహన్ రాజ్, మోకా మల్లయ్య, శీనప్ప, అంజినయ్య, లింగన్న, ఎంపిటిసి బంగారు పటేల్ యాదవ్, వైసిపి నాయకులు చిన్న ఈరన్న, వైస్ ఎంపిపి శ్రీరాములు, వార్డు సభ్యులు జలందర్, హుస్సేన్, బ్రహ్మ, చంద్రకాంత్ రెడ్డి, రంగన్న, చంద్ర, బంగారి రామకృష్ణ, భాస్కర్, కంది శీను, వెంకటేష్‌లు చిన్న రామకృష్ణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

వరద బాధితులకు విరాళం అందజేత



చెక్కును అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- దేవనకొండ

విజయవాడ వరద బాధితుల సహాయార్థం టిడిపి మండల సీనియర్ నాయకులు, మాజీ సర్పంచి ఉచ్చీరప్ప ఆధ్వర్యంలో సేకరించిన రూ.1.16 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుధవారం అందజేశారు. విజయవాడ వరద బాధితులకు అండగా నిలిచేందుకు దేవనకొండ, పి.కోటకొండ, పల్లెదొడ్డి, బి సెంటర్, నల్లచెలిమల, బైరవాణికుంట, గద్దెరాళ్ల, కె.వెంకటాపురం, కుంకనూరు, పొట్లపాడు, కొత్తపేట గ్రామాల నాయకులు విరాళాలు సేకరించారు. చెక్కును విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉచ్చీరప్ప అధ్యర్యంలో టిడిపి నాయకులు పి.కోటకొండ మల్లెపల్లె రంగడు, రాజశేఖర్ గౌడ్, వెల్డింగ్ దస్తగిరి, బంకు షేకన్న, శ్రీనివాసులు, రమేష్ అందించారు.

మహారాజశ్రీ కర్నూలు అదనపు సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
ఇ.పి.నెం.42/2023 ఇన్ ఓ.యస్.8/2023

యస్.మల్లికార్జున రెడ్డి ... డిక్రిహోల్డర్
-వర్సెస్-
అత్తులూరి విజయ్‌కుమార్ ... జె.డి.అర్

వేలం ప్రకటన

ఈ క్రింద కనబరచిన స్థిరాస్థిని కోర్టువారు 14-10-2024 వతేది ఉదయం 10.30 గంటల నుండి కోర్టు ప్రంగణములో వేలం వేయుదురని తెలియజేయడమైనది. కావలసిన వారు వేలంలో పాల్గోన వచ్చును.

షెడ్యూలు :-
Kurnool Division Sub-Division, Kurnool Municipal Corporation, Kallur Gramapanchayath, Kallur (V) In Survey No.328/1A,328/1C,387/3 Land piki, Total extent A.C.0.05.3/4 cents in that Northern side Ac.0.04.3/4 cents or 38.5 yards.

Bounded as
East : Land of SAP Camp.
West : Remaining Land of Somisetty Padmavathi
North : Place of Somisetty Srinivasulu.
South : Place of Somisetty Padmavathi.

Measurements :-
1st Item :
East-West 57 Feet or 17-.3736 meters
North - South : 30 feet or 9.1440 meters
2nd Item :
Eastern side : North-south : 14 Feet or 4.2672 meters
Western side : North -South : '0'Feet pr 0.0000 meters
Northern side : East - West : 57 feet or 17.3736 meters
Southern side : East - West : 57 feet or 17.3736 meters
Total Extent :2109 SFT or 234.33 Sq. yards.
D.Hr. Value : Rs.2,00,000/-
Amin Value : Rs.60,00,000/-

కోర్టు వారి ఉత్తర్వుల మేరకు
వాయిదా తేది : 14-10-2024

టి. ఈశ్వర్‌బాబు
డి. హెచ్.ఆర్ తరుపు న్యాయవాది.
కర్నూలు.